క్లుప్తంగా

దర్గాలో మంత్రి సత్యవతి జన్మదిన వేడుకలు



నాగుల్‌మీరా దర్గా ప్రాంగణంలో నాయకులతో మంత్రి సత్యవతి, ఎంపీ మాలోత్ కవిత

ఇల్లెందురూరల్: సత్యనారాయణపురం శివారు అటవీ ప్రాంతంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గా చిల్లా ప్రాంగణంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం తన జన్మదిన వేడుకలను నిర్వహించారు. నాగుల్‌మీరాకు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి ఎంపీ మాలోత్ కవిత, మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్ అంగోత్ బిందు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులకు అందజేశారు.

కార్మిక చట్టాలను రక్షించుకోవాలి

పాల్వంచ: ఉద్యమాలతో కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో 104వ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఏఐటీయూసీ అనేక పోరాటాల ఫలితంగా నాడు అనేక కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగిందని, నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ ప్రభుత్వాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధాకర్ నాగరాజు, జకరయ్య, చేరాలు, వెంకన్న, భాషా పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నాగుల్‌మీరా



జూలూరుపాడు: పాపకొల్లు గ్రామ పంచాయతీ పుట్టకోటకు చెందిన ఎస్కే నాగుల్‌రా ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అక్టోబర్ 29, 30వ తేదీల్లో హైదరాబాద్‌లో అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 2వ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఇందులో ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ ఎన్నిక నిర్వహించారు. నాగుల్ మీరా రెండోసారి ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడి ఎన్నికయ్యారు. ప్రస్తుతం నాగుల్‌మీరా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు

పాల్వంచ: ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు మండలంలోని ఇల్లెందులపాడు తండా, పాండురంగాపురం, పాత సూరారం గ్రామంలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యాకలాపాలు జరుగుతున్నా, గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాదాస్పదం కనిపించినా, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా చేసినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

4న టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): 4వ తేదీన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం రామవరం టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తెలిపారు. మంగళవారం రామవరంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్‌బెల్ట్ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు.

రోళ్లపాడులో సీతారామ ఏదీ?



మాట్లాడుతున్న ప్రతాప్

ఇల్లెందు: రోళ్లపాడులో సీతారామ ప్రాజెక్టుకు చరమగీతం పాడిన సీఎం కేసీఆర్ తన హామీలను విస్మరించి మళ్లీ ఇల్లెందు రావటం మీకే చెల్లిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ అన్నారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్లలో అనేక వాగ్దానాలు చేసి వాటి అమలు మరిచారని విమర్శించారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, 100 పడకల ఆస్పత్రి, బయ్యారం పెద్ద చెరువు రిపేరు, పోడు భూములకు పట్టాలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఏవని ప్రశ్నించారు.

వనరులు ఉన్నా.. ఉపాధి అంతంతే

సీఎం గారూ ఆలకించండి.. ఇల్లెందు నియోజకవర్గ ప్రజల విన్నపం



ఇనుప ఖనిజ నిక్షేపాలు విస్తారంగా ఉన్న బయ్యారం పెద్ద గుట్ట

భూగర్భంలో విస్తారంగా ఖనిజ సంపద.. ఉపరితలంలో పుష్కలంగా జలవనరులు.. విశాలమైన భూభాగం.. వందల సంఖ్యలో మేధావులు.. వేల సంఖ్యలో శ్రమజీవులు కలగలిసిన చారిత్రక నియోజకవర్గం ఇల్లెందు. దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి పుట్టినిల్లు. తెలంగాణలో వ్యాప్తంగా అత్యధిక విస్తీర్ణంలో ఇనుప ఖనిజ నిక్షేపాలు ఉన్న సుసంపన్న ప్రాంతం. సహజ సిద్ధంగా సుదూర ప్రాంతాల నుంచి జలవనరులు ముద్దాడే చెరువులు.. ఇలా ఒకటేమిటి లెక్కకు మించిన ప్రత్యేకతలు కలగలిసిన ఇల్లెందు నియోజకవర్గం పాలకుల చిన్నచూపు కారణంగా వెనుకబడిపోయింది. స్వరాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమంలో కొంత మెరుగుపడ్డా ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. బుధవారం నిర్వహిస్తున్న ప్రజాశ్వీరాద సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్నారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఆలకించి పరిష్కారం చూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇల్లెందురూరల్: సింగరేణి సంస్థకు జన్మనిచ్చిన ఇల్లెందులో బొగ్గు నిక్షేపాలు అంతరిస్తుండటంతో సంస్థ మనుగడ తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో బయ్యారం మండలంలో విస్తారంగా నిల్వ ఉన్న ఇనుప ఖనిజాన్ని దృష్టిలో పెట్టుకొని బయ్యారం కేంద్రంగా ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఈప్రాంత ప్రజానీకం కోరుతోంది.

- సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం కేసీఆర్ గార్ల, బయ్యారం మండలాల సరిహద్దులో దశాబ్దాలుగా హామీలకే పరిమితమైంది. గత నాలుగు అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ మున్నేరు ప్రాజెక్టును నిర్మిస్తామని హామీలు ఇవ్వడం అన్ని రాజకీయ పక్షాలకు రివాజుగా మారింది. ఆ కల నేరవేర్చాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.
- రాష్ట్రంలో బీడీ ఆకు సేకరణ ఇక్కడి నుంచే అత్యధికంగా జరుగుతోంది. కానీ ఎన్నికల సమయంలో బీడీ పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటున్న హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ సారైనా స్థానికంగా మహిళలకు ఉపాధి కల్పించేలా ఇల్లెందు కేంద్రంగా బీడీ పరిశ్రమను ఏర్పాటు చేయాలని తునికాకు సేకరణ కూలీలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఇల్లెందు పట్టణానికి అతి సమీపంలో నిర్మించిన యువజన శిక్షణ కేంద్రం నిర్మాణ సమయంలో నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోలేక పోతోంది. శిక్షణ కేంద్రాన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో అక్రమాలకు నెలవుగా మారింది. శిక్షణ పొందిన యువతకు నామమాత్రపు ఉపాధి చూపుతూ మోసం చేస్తున్నారు. ఫలితంగా ఎంతోమంది యువత వైటీసీ శిక్షణ శిబిరాలకు దూరంగా ఉంటున్నారు. వైటీసీ నిర్వహణ బాధ్యతను పూర్తిస్థాయిలో ఐటీడీఏకు అప్పగించి ఉపాధి అవకాశాలు కల్పించాలని యువత కోరుతోంది.
- ఇల్లెందు మండల వ్యాప్తంగా రైతులు 15వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తున్నారు. పండిన పంటలను నిల్వ చేసుకునేందుకు మండలంలో ఒక్క వ్యవసాయ గోదాము కూడా లేదు. దీంతో మద్దతు ధరతో నిమిత్తం లేకుండా దళారులు అడిగిన ధరకే కల్లాల్లోనే విక్రయించుకోవాల్సిన దుస్థితి. వ్యవసాయ గోదాములు నిర్మించి తమకు మేలు చేకూర్చాలని రైతులు కోరుతున్నారు.
- మండలంలో కనీసం వంద ఎకరాల స్థాయిలో సాగునీటి ప్రాజెక్టు లేకపోవడంతో అత్యధిక విస్తీర్ణంలో పంటలు వర్షాధారంగానే సాగవుతున్నాయి. వర్షాలు కురిస్తే తప్ప పంటలు పండని పరిస్థితి నెలకొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏజెన్సీ గ్రామాలకు సీతారామ ప్రాజెక్టు నీరందించాలి, ప్రధాన వాగులైన మస్సివాగు, ముర్రేడు వాగు, పందిపంపులవాగు, రాళ్లవాగు, చలివాగులపై చెక్‌డ్యాంలు నిర్మించాలి. తద్వారా భూగర్భ జలాలు పెరిగి కనీసం బోర్ల ద్వారా అయినా పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఇల్లెందు ఏజెన్సీ నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు పదుల సంఖ్యలో ఉన్నారు. నియోజవకర్గ వ్యాప్తంగా అనేక మంది యువకులు క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వీరి స్ఫూర్తితో క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ వనరులు లేక అవకాశాలు అందక చాలామంది యువత నిరాశ చెందుతున్నారు. ఏజెన్సీ మండలాలకు కేంద్రంగా ఉన్న ఇల్లెందులో స్పోర్ట్స్ స్కూల్‌ను మంజూరు చేయాలని యువత కోరుకుంటోంది.



ఉపయోగపడని యువజన శిక్షణ కేంద్రం

- దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణికి పుట్టినిల్లైన ఇల్లెందులో ఆ సంస్థ ప్రయాణం వందేళ్లకు పైగా కొనసాగింది. వేల సంఖ్యలో కార్మికులు సంస్థకు సేవలిందించారు. కానీ సింగరేణి సంస్థ తనకు వచ్చిన లాభాల నుంచి పుట్టినింటిని విస్మరించి ఇతర ప్రాంతాలలో సాంకేతిక, ఉన్నత విద్యా సంస్థలను నెలకొల్పుతోంది. ప్రస్తుతం పుట్టినింటిలో చరమాంకంలో ఉన్న సింగరేణి సంస్థ తీపి గుర్తుగా ఒక సాంకేతిక విద్యాసంస్థను ఇల్లెందులో నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు.
- నియోజకవర్గ వ్యాప్తంగా మైనారిటీ, సాంఘిక సంక్షేమ, వెనకబడిన తరగతుల గురుకులాలను నెలకొల్పారు. కానీ వాటిని నిర్వహించేందుకు అద్దె భవనాలు లేకపోవడంతో కొన్ని గురుకులాలు ఇతర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. ఇంతే కాకుండా గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను గతంలో ఇల్లెందుకు మంజూరు చేసి శంకుస్థాన జరుగుతుందన్న తరుణంలో అశ్వారావుపేట నియోజకవర్గానికి తరలించారు. ఇలా విద్యాసంస్థలు ఒక్కొక్కటి దూరమవడంతో తమకు అన్యాయం జరుగుతోందని, తరలిపోయిన విద్యాసంస్థలను తిరిగి ఇల్లెందుకు మంజూరు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



సింగరేణి(కొత్తగూడెం): గురుదాస్ గుప్తా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



టేకులపల్లిలో కేక్ తినిపిస్తున్న రాంచందర్

సింగరేణి(కొత్తగూడెం)/టేకులపల్లి: కార్మిక పక్షపాతి ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం టేకులపల్లి సీపీఐ కార్యాలయంలో, కొత్తగూడెం పట్టణంలోని శేషగిరిభవన్‌లో ఘనంగా జరుపుకున్నారు. యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి గురుదాస్ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. టేకులపల్లిలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాంచందర్, శ్రీను, ఐత శ్రీరాములు, వాసం భద్రయ్య, కొత్తగూడెంలో రాజ్‌కుమార్, కే.సారయ్య, వంగా వెంకట్, జీ.వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, బందెల నర్సయ్య పాల్గొన్నారు.

కార్మికులను మరవడం బాధాకరం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు విడుదల చేసిన మేనిఫెస్టోలో సింగరేణి కార్మికుల అంశాలు పెట్టకపోవటం బాధాకరమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం, ప్రభుత్వ అర్థిక దోపిడీ పెరిగిపోతోందని, సింగరేణి కంపెనీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ గనులను ఏర్పాటు చేసి, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామన్న కేసీఆర్ హామీలను విస్మరించారని గుర్తుచేశారు. శ్రీరాంపూర్ నుంచి వర్చ్‌వల్‌గా ప్రారంభించిన గనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. సింగరేణి యాజమాన్యం మూతపడిన భూగర్భ గనులను ప్రారంభించి కొత్తగనులుగా పేరుపెడుతోందని, అలా కాకుండా కొత్త భూగర్భగనులు చేపడితే సుమారు 1300 మందికి ఉపాధి కలుగుతుందన్నారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.సారయ్య, కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ.వీరస్వామి, ఏరియా బ్రాంచి కార్యదర్శి వి.మల్లీకార్జున్‌రావు, బందెల నర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీకి నివాళి

భారతదేశ ఉక్కు మహిళ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ అని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ అనేక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న నాయకులు



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తగూడెంరూరల్: జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో



టేకులపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం

పాల్వంచ: పట్టణంలోని కేఎస్‌పీ రోడ్డులో శ్రీ గాయత్రి హోమియో ఆస్పత్రిలో నవంబర్ 1వ తేదీన ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ పి.ఉప్పలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో పాటు, తరుణ వ్యాధులకు సంబంధించి చికిత్సతో పాటు మందులు కూడా అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరియర్స్ చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డీజీఎం సివిల్ రాజశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ... రెండేళ్ల క్రితం పెరిగిన డీఏ బాపతు ఎరియర్స్ డబ్బులను కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్టర్ల ద్వారా సింగరేణి కంపెనీ డైరెక్ట్‌గా చెల్లించాల్సి ఉందన్నారు. 2021 ఏప్రిల్ నుంచి అందజేయాల్సిన పెండింగ్ ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని, అందుకు సివిల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పథకాలను అడ్డుకుంటున్నారు..



మాట్లాడుతున్న బీజేపీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి రవీంద్రనాయిక్, పక్కన కర్ణాటక ఎమ్మెల్సీ సతీష్

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో చేస్తున్న ప్రకటనలన్నీ మోసపూరితమైనవని కర్ణాటక ఎమ్మెల్సీ సతీష్, బీజేపీ ఇల్లెందు అభ్యర్థి ధరావత్ రవీంద్రనాయక్ ఆరోపించారు. రొంపేడు గ్రామ సమీపంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కర్ణాటకలో మహిళలకు బస్సు ఫ్రీ అని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు బస్సుల సంఖ్యను తగ్గించారని, ఆర్టీసీ ఉద్యోగులకు కనీసం జీతాలు కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉచిత విద్యుత్ కనీసం ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2వేలు నేటికీ ప్రారంభించలేదని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నేడు మరోసారి ప్రజల ముందుకొచ్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రాజెక్టుల పేరుతో పెద్దమొత్తంలో అవినీతికి పాల్పడ్డారని, రానున్న రోజుల్లో వారి అక్రమాలు వెలుగుచూస్తాయని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సీతారామ ప్రాజెక్టుకు ఇల్లెందు నియోజకవర్గంలో శంకుస్థాపన చేసినప్పటికీ నేటికీ ఒక్కబొట్టు నీటిని కూడా ఇల్లెందుకు సరఫరా చేయలేదన్నారు. మోదీ నాయకత్వంలోని బీజేపీని గెలిపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, నాళ్ల సోముసుందర్, గోపి, సంజీవ రెడ్డి, విమల్‌కుమార్ జైన్, రాంచందర్‌నాయక్, సురేందర్, మావునూరి మాధవ్, మిర్యాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: నవంబర్ 5న హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న విశ్వబ్రాహ్మణ మహాగర్జన సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తెలంగాణ మలి దశ ఉద్యమ సమయంలో తన ప్రాణాన్ని త్యజించి ఉద్యమానికి ఊపిరిలూదిన శ్రీకాంతాచారితో పాటు 42 మంది అసువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో విశ్వబ్రాహ్మణ జాతిని గుర్తించి ప్రాధాన్యం కల్పించిన వారికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అనంతరం మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో సత్యనారాయణ, మొగులోజు సీతారామచారి, సిరికొండ స్వరూప, రవికాంత్, మోతుకూరి విజయలక్ష్మి, రవి, మోతుకూరి రవి, తిరుమలరావు, వెంకట రామాచారి, రవికాంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేకులపల్లి: ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడెం తండా బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియకు మద్దతుగా మంగళవారం ప్రచారం నిర్వహించారు. తొలుత స్థానిక వేంకటేశ్వర స్వామి (బుడియా బాపు) దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి ప్రచారం చేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతోహరిప్రియను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కణితి రమాదేవి, జాటోత్ నరేష్ నాయక్, కొండబత్తుల శ్యామ్, జార మల్లేష్, తండా నాయకులు అంగోత్ లచ్చా నాయక్, కొత్త చిట్టీ రాజు, అంగోత్ బిక్కు లాల్, మాలోత్ లింగా, బోడ రమేష్, దాసరి లింగమల్లు, కోరం శ్రీకాంత్, బానోత్ రవి, బాదావత్ నాగేశ్వరావు, బానోత్ రమేష్, బోగా దన్ను, అంగోత్ మంగీలాల్, దిలీప్, జాటోత్ మోహన్, మహేష్, గణేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు గౌరవమేది?



సమావేశమైన తెలంగాణ ఉద్యమకారులు

ఇల్లెందురూరల్: ఉద్యమించి సాధించుకున్న స్వరాష్ట్రంలో నేడు రాబందులే రాజ్యమేలుతున్నారని బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ సభ్యులు, తెలంగాణ ఉద్యమకారులు ఆరోపించారు. ఇల్లెందు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు మొండితోగు మామిడితోటలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం అంకితభావంతో ఉద్యమించామని, నాడు తమ ఉద్యమాన్ని నిలువరించేందుకు చేసిన కుట్రల్లో తాము ఈ ప్రాంతంలో భూములను కూడా వదిలేయాల్సి వచ్చిందన్నారు. ఒకరిద్దరు నక్సల్స్ తుపాకీ తూటాలకు అమరులయ్యారని గుర్తుచేశారు. అంతటి నిర్బంధాలను అధిగమించిన తమకు రాష్ట్రం సిద్ధించిన తరువాత ఎటువంటి అవకాశాలు కల్పించలేదన్నారు. కనీస గౌరవం కూడా ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల పేరుతో అవకాశాలను అందిపుచ్చుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ సైతం తమ ఆవేదనను పట్టించుకోలేదని ఆరోపించారు. కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవడం లేదని వాపోయారు. పార్టీ అగ్రనాయకత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వడంతోపాటు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మంగళవారం ఇల్లెందుకు వస్తున్న సీఎం కేసీఆర్‌ను స్వయంగా కలిసి వినతిపత్రం ఇస్తామని, తమ ప్రయత్నాన్ని అడ్డుకుంటే సభను బహిష్కరించేందుకు, ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి పనిచేసేందుకూ వెనుకాడబోమని స్పష్టం చేశారు. సమావేశంలో దేవీలాల్‌నాయక్, రెంటాల బుచ్చిరెడ్డి, ఎస్‌కే గౌస్, సిరిమల్లె రాజు, గోపగాని వెంకన్న, భావ్‌సింగ్, ఆదూరి రవి, ఈసం నర్సింహారావు, తురక దాసు, భూక్యా లాలునాయక్, సురేష్ సాహు, జగదీష్, ముత్యాల శ్రీనివాస్, బచ్చల రాజు, వెంకన్న, రాంచందర్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

వల్లభాయ్ పటేల్ సేవలు మరువలేనివి



కొత్తగూడెంరూరల్: 6వ బెటాలియన్‌లో...



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో...



పాల్వంచ: రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న కేటీపీఎస్ అధికారులు

భారతదేశ ఐక్యత, సమగ్రత, భద్రత కోసం అహర్నిశలు శ్రమించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలు సాధించాలని పలువురు వక్తలు అన్నారు. పటేల్ జయంతి సందర్భంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మంగళవారం నేషనల్ యూనిటీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రీయ ఎక్తా దివస్ ప్రతిజ్ఞ చేశారు. మాట్లాడుతూ.. సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశానికి మొదటి హోం మినిస్టర్‌గా హైదరాబాద్, జునాగఢ్ వంటి సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి కృషి చేసిన వ్యక్తిగా... కులం, మతం, ప్రాంత బేధాలు లేకుండా భారతీయులందరూ ఒక్కటేనని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. దేశంలోని యువత ఆయన ఆశయాలు సాధించాలని కోరారు.

– సాక్షినెట్‌వర్క్



చుంచుపల్లిలో పటేల్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు



చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయంలో...



జాతీయ ఐక్యతా దినోత్సవంలో పాల్గొన్న సింగరేణి అధికారులు, ఉద్యోగులు